'బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం'

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోటగిరి, మార్చి 3 : బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఎత్తొండ మాజీ ఎంపీటీసీ సయ్యద్ ఫారూఖ్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని యాద్గార్‌పూర్‌లో బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీని నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సమీర్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తిప్పయ్య, యాద్గార్‌పూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు సయ్యద్, మాజీ ఉప సర్పంచ్ అంజనేయులు, కిష్టయ్య, టాక్లీ యూత్ విభాగం నాయకుడు అనిల్, ఆంజనేయులు, సాయినాథ్, మస్తాన్, ఖయ్యూం, అష్టల్, ఆసిఫ్‌ఖాన్, దండు సాయిలు, అఖిల్, అశోక్ పాల్గొన్నారు.

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

కోటగిరి, మార్చి 3 : రాష్ట్రప్రభుత్వం మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కల్పించకుంటే ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి వెంకటస్వామి హెచ్చరించారు. కోటగిరి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా హస్కూల్ శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా కన్నం శ్రీనివాస్, జలయ్య, ప్రధానకార్యదర్శిగా రేణి సాయిలు, కోశాధికారిగా దండి సాయిబాబు, సహాయ కార్యదర్శిగా నితిని కన్నం, ప్రచార కార్యదర్శిగా హస్కుల విజయ్, కార్యదర్శిగా దేగం రవీందర్, సలహాదారులుగా మేత్రి సాయిలు, కృష్ణ, నక్కల మారుతి, గౌరవ అధ్యక్షుడిగా కన్నం సాయిలు, కార్యవర్గసభ్యులు వినోద్, కోటగిరి యూత్ విభాగం అధ్యక్షుడిగా జెండా దినేశ్‌ను ఎన్నుకున్నారు.

సెక్స్‌వర్కర్లు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

ఖలీల్‌వాడి, మార్చి 3: సెక్స్‌వర్కర్లు తమ ఆరోగ్యం అవగాహన కలిగి ఉండడంతోపాటు తగిన శ్రద్ధ వహించాలని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేశ్‌కుమార్ యాదవ్ సూచించారు. అంతర్జాతీయ సెక్స్‌వర్కర్స్‌డే సందర్భంగా జిల్లాకేంద్రంలోని న్యూఅంబేద్కర్ భవన్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సెక్స్‌వర్కర్లు సొంత కాళ్లపై నిలబడేందుకు చిన్నచిన్న వృత్తి వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా ఎంఎస్ఎంఈ పోర్టల్‌లో వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రూ. లక్ష వరకు లోన్ అందిస్తారని తెలిపారు. స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు క్రీడల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేసి, సత్కరించారు.

జాతీయస్థాయి క్రీడాకారిణికి సన్మానం

మహిమను సన్మానిస్తున్న వివేకానంద స్వామి యూత్ ప్రతినిధులు

సారంగాపూర్, మార్చి 3 : హర్యానా రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో పాల్గొని సిల్వర్ మెడల్ సాధించిన సారంగాపూర్ జడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని మహిమతోపాటు క్రీడల్లో ప్రోత్సహించిన పీఈటీ కృష్ణం రాజును గ్రామ వివేకానంద స్వామి యూత్ ప్రతినిధులు సోమవారం సన్మానించారు.

'ప్రజావాణి'కి 62 ఫిర్యాదులు

కంఠేశ్వర్, మార్చి 3 : జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 62 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వెల్లడించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, డీపీవో శ్రీనివాస్, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

సమస్యలు పరిష్కరించాలని

డిచ్‌పల్లి మైనార్టీ బాలుర కళాశాల విద్యార్థుల వినతి

కంఠేశ్వర్, మార్చి 3 : కళాశాలలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిచ్‌పల్లి మైనార్టీ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్ కుమార్‌రెడ్డి ప్రతి విషయానికి పెనాల్టీ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని, నాణ్యమైన భోజనం అందించడం లేదని ప్రిన్సిపాల్, స్టాఫ్‌కు ఎవరికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. తమ కెమిస్ట్రీ లెక్చరర్ అనారోగ్యం పేరుతో కళాశాలకు సెలవుపెట్టడంతో చాలా మంది స్టూడెంట్స్ పరీక్షల్లో ఫెయిలవుతామనే భయంతో ఉన్నారని పేర్కొన్నారు. మరో ఇంగ్లిష్ లెక్చరర్ ప్రణీత్‌రెడ్డి సమస్యలపై ప్రిన్సిపాల్‌కు విన్నవించగా.. ఆమె పట్టించుకోకపోవడంతో టీజీఎంఆర్‌జేసీ హెడ్ ఆఫీస్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. ప్రిన్సిపాల్ ఇంగ్లిష్ లెక్చరర్ ప్రణీత్‌రెడ్డిపై హెడ్ ఆఫీస్‌కు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

లెటర్ పంపడంతో ఆయన కాలేజీకి రావడం లేదని వివరించారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ అర్షి ఇక్బాల్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. కళాశాలలో సమస్యలు లేవని, సమస్యలపై తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే పరిశీలించి, పరిష్కరిస్తానని చెప్పారు.

హిందూ ఆలయాల ఆస్తులను పరిరక్షించాలి

సుభాష్‌నగర్, మార్చి 3 : హిందూ ఆలయాల ఆస్తులను పరిరక్షించాలని కోరుతూ హిందూ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దేవాలయ పరిరక్షణ సమితి అధ్యక్షుడు పటేల్ ప్రసాద్ మాట్లాడుతూ.. వర్ని మండల కేంద్రంలో సత్యనారాయణపురం రామాలయం వెనుక అనుమతులు లేకుండా ఒక వర్గం ప్రార్థనా మందిరాన్ని నిర్మిస్తున్నదని, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని కోరారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరందేలా చర్యలు చేపట్టాలి

- వీసీలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

కంఠేశ్వర్, మార్చి 3 : చివరి ఆయకట్టు వరకు పంటలకు సాగునీరందేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ఆమె సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. యాసంగి పంటలకు రాబోయే పది రోజులు కీలకమని, సాగునీరు, విద్యుత్ సరఫరా అవసరమైన మేర పంట పొలాలకు చేరేలా, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఆదేశించారు. సింగిల్

వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికాలు

యూజ్ ప్లాస్టిక్ నివారించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్వర్టు గుంతలో పడి ఒకరికి తీవ్రగాయాలు

- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న గ్రామస్తులు

సిరికొండ, మార్చి 3 : మండలంలోని పందిమడుగు సమీపంలో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. సిరికొండ నుంచి వేములవాడ, సిరిసిల్లకు ప్రధాన రోడ్డు మార్గం కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ కల్వర్టు గుంతతో ఆదివారం సాయంత్రం పందిమడుగు గ్రామానికి చెందిన జలంధర్ ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదవశాత్తు కల్వర్టులో పడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం జలంధర్‌ను జిల్లా కేంద్రంలోని ఓ దవాఖానకు తరలించారు. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

జాతీయ పసుపు బోర్డు సెక్రటరీగా నియామకమైన ఐఏఎస్ భవానీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డిని ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం జక్రాన్‌పల్లి మండలంలోని మనోహర్‌బాద్‌లో జేఎంకేపీఎస్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన పసుపు ఆధారిత పరిశ్రమను సందర్శించారు.

– కంఠేశ్వర్, మార్చి 3

టీయూలో కారుణ్య నియామకం

ప్రసన్న హింసికకు నియామకపత్రాన్ని అందజేస్తున్న వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, మార్చి 3: టీయూలో జూనియర్ అసిస్టెంట్‌గా కుమారి గుమ్మన ప్రసన్న హంసికను కారుణ్య నియామకం చేశారు. ఆమెకు నియామకపత్రాన్ని వీసీ ఆచార్య యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి సోమవారం అందజేశారు. టీయూలో తెలుగు విభాగంలో సుదీర్ఘకాలం పనిచేసిన దివంగత బాలశ్రీనివాసమూర్తి అకాల మరణం చెందగా.. ఆమె కుమార్తె ప్రసన్న హంసికకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం అందజేశారు.

అడిషనల్ కంట్రోలర్‌గా సంపత్ నియామకం

- డిచ్‌పల్లి, మార్చి 3 : టీయూలో అడిషనల్ కంట్రోలర్ (కాన్ఫిడెన్షియల్)గా డాక్టర్ టి.సంపత్‌ను నియామకమయ్యారు. ఆయనకు వీసీ ప్రొఫెసర్ ఆచార్య టి.యాదగిరి రావు ఉత్తర్వులు సోమవారం అందించారు.

స్పందించారు.. చెత్తను తొలగించారు..

చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

పొతంగల్, మార్చి 3 : పొతంగల్ – బోధన్ వెళ్లే రోడ్డు చెరువుకు ఇరువైపులా చికెన్ వ్యర్థాలతో కూడిన చెత్తను జీపీ అధికారులు సిబ్బందితో సోమవారం శుభ్రం చేయించారు. 'చెత్త సమస్య పట్టదా' శీర్షికతో నమస్తే తెలంగాణ దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి జీపీ అధికారులు స్పందించారు. చెత్తను తొలగించి, పరిసరాలను శుభ్రం చేయించారు. దీంతో స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షల అంబులెన్స్ ప్రారంభం

ఖలీల్‌వాడి, మార్చి 3 : ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షల అంబులెన్స్ సేవలను డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో హెచ్ఐవీ ప్రబలడానికి అవకాశమున్న హైరిస్క్ ప్రాంతాల్లో జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ యూనిట్ ఆధ్వర్యంలో అంబులెన్స్ సేవలు ప్రణాళికా ప్రకారం నిర్వహిస్తారని తెలిపారు. ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు, చికిత్స, కౌన్సెలింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో డీపీఎం సుధాకర్, సీపీవో మోయిజ్, నవీన్, ప్రవంతి, రాజేశ్వర్, నాగరాజు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సిరికొండ, మార్చి 3 : విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పీఎన్ఎం హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్, స్పెల్ బీ పోటీల్లో సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థుల ప్రతిభ కనబర్చారు.అబాకస్, వేదిక్ మ్యాథ్స్, స్పెల్ బీ వివిధ విభాగాల్లో నలుగురు విద్యార్థులు రైజింగ్ స్టార్స్‌గా నిలిచి ప్రోత్సాహక బహుమతులు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. ఉపాధ్యాయులు గంగారెడ్డి, పూజిత్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ

కోటగిరి, మార్చి 3 : మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ సమావేశపు హాలులో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో 2023-2024 సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో రూ 2.38 కోట్ల పనులు జరిగాయని అధికారులు తెలిపారు. ఇందులో నిర్లక్ష్యం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.22 వేలకు పైగా పెనాల్టీ వేశామని, ఉన్న మొక్కల కన్నా ఎక్కువ బిల్లులు నమోదు చేసినందుకు రూ.5,500 రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, ఎస్‌టీఎం అంజద్ అలీ, ఎస్ఆర్పీ రాజశేఖర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో చందర్, ఏపీవో గంగారాం పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వినాయక్‌నగర్, మార్చి 3 : రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విఠలేశ్వర్ నగర్ వద్ద రైస్‌మిల్ పక్కన ఉన్న ఖాళీస్థలంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, స్పెషల్‌పార్టీ సిబ్బంది సోమవారం దాడి చేశారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి మూడు మొబైల్ ఫోన్లు, రూ.2,450 నగదు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

రేపటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు

- విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావొద్దు
- జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్

ఖలీల్‌వాడి, మార్చి 3 : రేపటి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికావొద్దని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ సూచించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు, ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం హాల్‌టికెట్లు ఇవ్వకపోతే ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరుకావొచ్చని, హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేదా కళాశాల స్టాంప్ గానీ ఉండాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు.

పరీక్ష రాయనున్న 36,222 మంది విద్యార్థులు..

57 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

జిల్లాలో 57 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని జిల్లా ఇంటర్ విద్యాధికారి వెల్లడించారు. మొత్తం 36,222 మంది విద్యార్థులు పరీక్ష రానున్నట్లు తెలిపారు. ప్రతి సెంటర్‌లో సీసీ కెమెరాల నిఘాతో పాటు 144 సెక్షన్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఫస్టియర్ జనరల్ విద్యార్థులు 15,053 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,736, సెకండియర్ జనరల్ విద్యార్థులు 13,944 మంది, సప్లిమెంటరీ కోసం 2,128 విద్యార్థులు, ఒకేషనల్ రెగ్యులర్ విద్యార్థులు 2,042, ప్రైవేట్‌గా 319 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. ఉదయం 8 గంటల వరకే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 8.45 గంటల వరకే పరీక్షా కేంద్రంలోనికి వెళ్లాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

చేనేత సహకార సంఘం పరిశీలన

రుద్రూర్, మార్చి 3 : మండలకేంద్రంలో చేనేత సహకార సంఘాన్ని సంబంధిత అధికారులు సోమవారం పరిశీలించారు. చేనేత పనిచేసే కార్మికుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కార్మికుల కోసం నేతన్న పొదుపు పథకాన్ని ప్రారంభించిందని, కార్మికులు పొదుపు చేసే మొత్తానికి 100లో 60 శాతం కలిపి ఇస్తుందని, రెండేండ్ల తర్వాత విత్‌డ్రా చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీవో వెంకటేశ్వర్లు, ఏడీవో హేమలత, సీడీ నరేందర్, సంఘం చైర్మన్ నారాయణ, సెక్రటరీ నాగరాజు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కలిగోట్‌లో 'రైతు పాలంబడి'

జక్రాన్‌పల్లి, మార్చి 3 : కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం –హైదరాబాద్ ఆధ్వర్యంలో మండలంలోని కలిగోట్‌లో రైతు పొలంబడి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వరిలో సమగ్ర సస్యరక్షణపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. అనంతరం లింగార్షక బుట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి వెంకటరెడ్డి, రుద్రూర్ కేవీకే శాస్త్రవేత్త విజయ్‌కుమార్ అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారులు ఉదయ్ శంకర్, హోన్నప్పగౌడ్, మండల వ్యవసాయాధికారిణి దేవిక, ఏఈవో శివప్రసాద్ పాల్గొన్నారు.

సామాజిక రంగంలో అందిస్తున్న సేవలకు ఇందల్వాయి మండల కేంద్రానికి చెందిన కోరట్‌పల్లి ఆనంద్ జాతీయస్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆర్యాణి సకల కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారం, ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

– ఇందల్వాయి, మార్చి 3

ఇక నుంచి ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన

ట్యాబ్‌లను చూపుతున్న ఎంఈవో బట్టు రాజేశ్వర్

బాల్కొండ, మార్చి 3: ఇక నుంచి ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన అందనుందని ఎంఈవో బట్టు రాజేశ్వర్ అన్నారు. ప్రైమ్ మినిస్టర్స్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం ఎస్‌హెచ్ఆర్ఐ) పథకం కింద డిజిటల్ పాఠాల బోధనకు కేంద్ర ప్రభుతం బాల్కొండ ఉన్నత పాఠశాలకు 25 ట్యాబ్ ఫోన్‌లను మంజూరు చేసిందని ఎంఈవో అన్నారు. సోమవారం పాఠశాలలో వాటిని ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2020లో నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ బోధన అమలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే బాల్కొండ జడ్పీహెచ్ఎస్‌లో దృశ్య బోధనా విధానం అమలవుతున్నదని అన్నారు. 8, 9, 10వ తరగతుల విద్యార్థులు పాఠ్యాంశాల్లో కలిగే సందేహాలను ట్యాబ్‌ల ద్వారా నివృత్తి చేయనున్నారని ఎంఈవో తెలిపారు.

ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలి

నీలాలో భూమిపూజ చేస్తున్న అధికారులు

భీమ్‌గల్/రెంజల్ (నవీపేట), మార్చి3: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ లబ్ధిదారులకు సూచించారు. సోమవారం భీమ్‌గల్ మండలంలోని లింగాపూర్‌లో 85 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఇండ్లు ఎలా నిర్మించాలనే అంశంపై పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను చేపడుతుంటే దశాల వారీగా డబ్బులు మంజూరవుతాయని అన్నారు. ఐదుగురు లబ్ధిదారుల ఇంటి నిర్మాణ పనులకు మార్కింగ్ చేశారు. హౌసింగ్ అధికారులు ప్రభు, సత్యనారాయణ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు. రెంజల్ మండలంలోని నీలాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నాయకులతో కలిసి అధికారులు భూమిపూజ చేశారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

రెంజల్ (నవీపేట), మార్చి 3: పుట్టింటి నుంచి భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో మద్యానికి బానిసై ఓ వ్యవసాయ కూలీ సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాయన్న కథనం ప్రకారం.. రెంజల్ మండలం తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన జంగం నవీన్(36) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దాంపత్య జీవితంలో మనస్పర్థలు రావడంతో నవీన్ భార్య నాలుగేండ్ల క్రితం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి మద్యానికి బానిసైన నవీన్ ఒంటరి జీవితం గడుపుతున్నాడు. మద్యం సేవించడంతో అనారోగ్యానికి గురై మతి స్థిమితం కోల్పోయాడు. సోమవారం గ్రామ సమీపంలో పెంట గంగాధర్ వ్యవసాయం పొలం వద్ద జామ చెట్టుకు షర్టుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరి జంగం శోభ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇదేం 'పంచాయితీ'?

- తండ్రి అంత్యక్రియల విషయంలో వివాదం
- కుల సంఘం జోక్యంతో ముదిరిన వైనం
- పోలీసుల చొరవతో ముగిసిన అంత్యక్రియలు!

వేల్పూర్ మార్చి 3: తండ్రి అంత్యక్రియల విషయంలో అన్నదమ్ములు పంచాయితీకి దిగడం చర్చనీయాంశమైంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరికి ఆస్తుల పంపకాలు చేయగా, భూమి విషయంలో కొడుకుల మధ్య కొన్ని నెలలుగా వివాదం కొనసాగుతున్నది. ఈ పంచాయితీ కాస్త కుల సంఘం వద్దకు చేరగా, గతంలో తండ్రిని సంఘ బహిష్కరణ చేశారు. అయితే, అనారోగ్యానికి గురైన తండ్రి దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. చిన్న కుమారుడు తండ్రి మృతదేహాన్ని ఇంటికి తీసుకురాగా, పెద్ద కుమారుడు సంఘం పెద్ద మనుషులకు ఫిర్యాదు చేశాడు. కుల బహిష్కరణకు గురైన వ్యక్తి మృతదేహాన్ని తీసుకురావడంపై కుల పెద్దలు చిన్న కుమారుడ్ని నిలదీశారు. దీంతో అతడు పోలీసులను ఆశ్రయించగా, వారు సంఘం పెద్ద మనుషులను మందలించినట్లు తెలిసింది. దీంతో వారు సైలెంట్ కావడంతో చిన్న కుమారుడు సోమవారం అంత్యక్రియలు జరిపించారు. మరోవైపు, ఈ వ్యవహారంపై వేల్పూర్ ఎస్సై సంజీవ్‌ను వివరణ కోరగా, తమకు ఎటువంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

నేర రహిత బోధన్ ఏర్పాటుకు కృషి చేద్దాం

అవగాహన కల్పిస్తున్న బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ

బోధన్, మార్చి 3: బోధన్‌ను నేర రహిత ఆదర్శవంత మైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామని పట్టణ సీఐ వెంకటనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని కొత్త బస్ స్టాండ్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళా బృందం వారిచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కళా బృందం సభ్యులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన సీఐ మాట్లాడారు. యువత మత్తు, మాదక పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

భీమ్‌గల్, మార్చి 3: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని పోలీస స్టేషన్‌కు తరలించారు. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. సోమవారం ఉదయం అనుమతులు లేకుండా ముక్కుర్ చౌరస్తా నుంచి ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు తనిఖీ చేశాడరు. ఇసుకకు సంబంధించిన అనుమతి పత్రాలు లేక పోవడంతో ట్రాక్టర్‌ను పోలీస స్టేషన్‌కు తరలించారు. ఇసుక తరలిస్తున్న వేముల సతీశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బోధన్ రూరల్ సీఐపై మహిళ ఫిర్యాదు

ఎడపల్లి, మార్చి 3: బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ మహిళ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు ఫిర్యాదు చేసింది. రెంజల్ మండలం దూపల్లికి చెందిన బోయి భాగ్య, గతనెల 13న జానకంపేట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరైంది. జాతరలో తన పర్సు పోయిందని, దానిని వెతికించాలని అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. అక్కడే ఉన్న బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు తనను లాఠీతో కొట్టాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

తడ్‌పాకల్ విద్యార్థినికి పురస్కారం

మోర్తాడ్, మార్చి3: ఉమెన్స్ రైటర్ మహిళా ఫోరం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా అందించే అక్షరయాన్ బాలిక పురస్కారానికి ఏర్గట్ల మండలం తడ్‌పాకల్‌కు చెందిన విద్యార్థిని సౌమ్య 2024-25 సంవత్సరానికిగాను ఎంపికైంది. ఆదివారం రాత్రి రవీంద్రభారతిలో పురస్కారాన్ని ప్రముఖులు సౌమ్యకు అందజేశారు. సౌమ్య ఇప్పటికే అనేక కవితలు, కథలు రాసి జాతీయస్థాయి బహుమతులు అందుకుంది. ఇంజినీరింగ్ చదువుతున్న సౌమ్య బాల్యం నుంచే సాహిత్యంలో ప్రతిభ చూపుతూ అందరిమన్ననలను పొందుతున్నది. సౌమ్యను సాహిత్య గురువు ప్రవీణ్‌శర్మతోపాటు గ్రామస్తులు అభినందించారు.

మాజీ సర్పంచ్‌కు ఉగాది పురస్కారం

మోర్తాడ్,